క్లుప్తంగా

రవాణాశాఖ కార్యాలయానికి స్థలం కేటాయించండి



వినతిపత్రం ఇస్తున్న రవాణాశాఖ అధికారులు

జగిత్యాలటౌన్: రవాణాశాఖ కార్యాలయానికి స్థలం కేటాయించాలని రవాణా శాఖ అధికారులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కోరారు. శనివారం ఉదయం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ఆయన నివాసం ఇందిరాభవన్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. రవాణా శాఖ కార్యాలయం తాటిపల్లిలో ఉండటంతో జగిత్యాల నుండి వాహన రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ టెస్టుల కోసం వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు రవాణాశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, ఎంవీఐలు రామారావు, అభిలాష్, వెంకన్న, ప్రమీల ఉన్నారు.

హ్యాండ్‌మిషన్లతో చెల్లింపులు సులభం



మిషన్లు అందజేస్తున్న డీఆర్డీఏ పీడీ

జగిత్యాల: ఎస్‌బీఐ వారు అందించిన హ్యాండ్ మిషన్లతో మహిళా సంఘాలకు చెల్లింపులు సులభతరమవుతాయని డీఆర్డీఏ పీడీ రఘువరన్ అన్నారు. శనివారం పలు మహిళా సంఘాల సభ్యులకు హ్యాండ్ హెల్డ్ మిషన్లు అందజేశారు. వీటిని ఎలా వినియోగించాలన్న దానిపై ఆర్పీలు, వీవోలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్‌గౌడ్, స్త్రీనిధి రీజనల్ మేనేజర్ రాంనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ గీతాంజలి, రమాదేవి, డీఎంసీ సునీత పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

సారంగాపూర్: ఇంటర్ పూర్తికాగానే జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని డిగ్రీ కళాశాల అధ్యాపకులు కోరారు. శనివారం సారంగాపూర్, బీర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రచారం చేశారు. ఇంటర్ పూర్తి కాగానే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందాలని, కళాశాలలో నిష్ణాతులైన ఫ్యాకల్టీ ఉన్నారని, మంచి బోధనతో పాటు రాష్ట్రస్థాయి గుర్తింపు పొంది, అన్ని రకాల మౌలిక వసతులు ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ శ్రీనివాస్, అధ్యాపకులు లెఫ్టినెంట్ పి.రాజు, సాయి మధుకర్, గోవర్ధన్, కందుకూరి శ్రీనివాస్, రజిత, దివ్యరాణి, కవిత, శ్రీనివాస్, స్వరూప, రాణి పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం

మల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తుందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. శనివారం మల్లాపూర్‌లో మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పనిచేస్తున్నారన్నారు. ప్రతి గ్రామానికి సీసీరోడ్లు, సైడ్‌డ్రైన్లు, 100 శాతం ప్రభుత్వ పథకాలు అందజేయనున్నట్లు తెలిపారు. రాబోయే పంచాయతీ, స్థానిక సంస్థలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడపుల పుష్పలత నర్సయ్య, వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, నల్ల రాజన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలి

మల్యాల: ఉద్యోగ, ఉపాధ్యాయుల రిటైర్మెంట్ బెనిఫిట్ వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి ఆనందరావు, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. నూకపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయురాలు సుజన పదవీ విరమణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీలు వెంటనే ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో జయసింహారావు, మండలాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, కిశోర్, జమీల్, రాజేందర్ రెడ్డి, వేణుగోపాల్ రావు పాల్గొన్నారు.

ఆదర్శ కవితా సుమాలు

జగిత్యాలటౌన్: విద్యా, ఉద్యోగ, వ్యాపారాలకు తోడు కుటుంబ బాధ్యతలతో నిత్యం బిజీగా ఉండే మహిళలు తమ రచనలతో సమాజాన్ని తట్టి లేపుతూ సాహితీవనంలో అక్షర పూలు పూయిస్తూ కవితా కుసుమాలుగా వెలుగు వెలుగుతూ రాష్ట్ర వ్యాప్త గుర్తింపు సొంతం చేసుకుంటున్నారు. మాతృత్వపు మమకారాన్ని, అమ్మతనపు ఔన్నత్యాన్ని ఆకాశమంత ఎత్తుకు చాటడంతో పాటు భ్రూణ హత్యలు, మహిళలపై వేధింపులు లాంటి సామాజిక రుగ్మతలను తులనాడుతూ సమాజంలోని మంచిని ప్రోత్సహిస్తూ, చెడును చెండాడుతున్నారు. తమ వైవిధ్యమైన రచనలతో తాము అందుకున్న అవార్డులు, రివార్డులకే వన్నె తెస్తున్నారు జగిత్యాలకు చెందిన మహిళలు..

సండే స్పెషల్

అన్నింటా తామై ముందుకు

జిల్లాకు చెందిన పలువురు మహిళా రచయితలు తమ వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో రాణిస్తూనే తీరిక సమయాలలో తమలోని సృజనాత్మకతకు పదును పెడుతూ అపురూపమైన రచనలతో సందేశాలు, చురకలతో సమాజంలోని చెడును కడిగేస్తూ మంచిని ప్రోత్సహిస్తూ మొల్లమాంబ వారసులుగా పేరు గడించారు.





ఇంటి బాధ్యతలు.. రచనలు

ఇల్లాలి ప్రేమెప్పుడు ఒంటరే అంటారు మార విజయలక్ష్మి ఇంటి బాధ్యతలతో నిరంతరం సతమతమయ్యే ఇల్లాలి ప్రేమెప్పుడూ ఒంటరేనంటారు మార విజయలక్ష్మి తన రెప్ప కింది ఉప్పెన కవితా సంపుటిలో..

విజయలక్ష్మి రచనలు

రెప్ప కింది ఉప్పెన, వెన్నెల వన్నెలు, జీవన నానీలు, విజయామృత వీచికలు, కోవిడ్ 19 విజేతలు లాంటి కవితా సంపుటాలలో 900పైగా కవితలు రాసిన విజయలక్ష్మి ఎన్నో అవార్డులు రివార్డులు పొందారు.

మార విజయలక్ష్మి.
ప్రభుత్వ ఉద్యోగి, రచయిత్రి

ఎన్నో అవార్డులు అనిత సొంతం



'నిన్ను ఆకాశమంత ఎత్తుకు ఎదిగించడానికి తాను నేల మీద పునాదిగా మారి నీ ప్రయత్నానికి పట్టుకొమ్మై తన ఉనికిని కాపాడుకోవడంలో ఓడిపోయింది అమ్మ అంటూ' అమ్మ గొప్పతనాన్ని తన కవితల ద్వారా లోకానికి చాటిన అనిత అమ్మలోని ఔన్నత్యాన్ని, మమకారపు మాధుర్యాన్ని ముందు తరాలకు అందిస్తున్నారు.

అవార్డులు–పురస్కారాలు

అక్షరాల తోవ వారితో జాతీయ ఉత్తమ కవితా పురస్కారం, స్వర్ణ భారతి వేదిక వారి జాతీయస్థాయి పోటీల్లో పురస్కారం, గోల్కొండ సాహితీ సంస్థ వారిచే మణిపూసల కవి భూషణ అవార్డు, జాతీయస్థాయి సినారే పోటీలో ఈటల రాజేందర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

సామాజిక చైతన్యం కలిగించే రచనల్లో సునీత ప్రత్యేకత



రాయికల్ మండలం ఇటిక్యాల ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న సునీత ఉద్యోగం, ఇంటి బాధ్యతలకు అదనంగా సామాజిక చైతన్యం నింపే రచనలు చేస్తూ రచయిత్రిగా తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న పలు జాడ్యాల నుండి అమాయక ప్రజలను చైతన్య చేసే రచనలు చేస్తున్న అనేక అవార్డులు, రివార్డులు అందుకున్నారు. నానీల అలలు, తెలంగాణ పలుకుబడులు, కానరాని వసంతం లాంటి అనేక రచనల ద్వారా సామాజిక చైతన్యం కలిగించారు సునీత.

అవార్డులు, రివార్డులు

జాతీయ స్థాయి తెలంగాణ కళా సరస్వతి అవార్డు, అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ భూపాల్ అవార్డు, ఇండో దుబాయ్ గ్లోబల్ అవార్డు, రాష్ట్ర స్థాయి ఎంవీ నరసింహారెడ్డి అవార్డు. జాతీయ తెలుగు రక్షణ వేదిక వారి బతుకమ్మ పురస్కారం, అరుణ గు రజాడ అమెరికా వారి గురజాడ తెలుగు కవి తా పురస్కారం, కళాశ్రీ ఆర్ట్స్ థియేటర్ జగిత్యాల వారి అలిశెట్టి పురస్కారం పొందారు.

మార్కండేయ జయంతి

కోరుట్ల/రాయికల్/ధర్మపురి/పెగడపల్లి/మల్యాల/ఇబ్రహీంపట్నం/మల్లాపూర్/గొల్లపల్లి: భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలు శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కోరుట్ల పట్టణం, మండల కేంద్రాలు, పలు గ్రామాల్లోని మార్కండేయ ఆలయాల్లో పద్మశాలీలు,భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కోరుట్లలో భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. మార్కండేయ స్వామి ఉత్సవ మూర్తులతో ఊరేగింపు నిర్వహించారు. చేనేత యంత్రంపై వస్త్రం నేసి, స్వామివారికి సమర్పించారు. మహిళలు ప్రత్యేకపూజలు, కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమాల్లో కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.



కోరుట్లలో శోభాయాత్ర లో భక్తులు

విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు



భోజనం పరిశీలిస్తున్న కమిషనర్

మెట్‌పల్లిరూరల్: విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ అన్నారు. మెట్‌పల్లి మండలం మేడిపల్లి మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. వంట, స్టోర్, తరగతి,వసతి గదులను పరిశీలించారు. మెనూ అమలుపై ఆరా తీశారు. విద్యార్థుల కోసం చేసిన అన్నం,కూరలు చూశారు.అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.నిర్వాహకులకు పలు సలహాలు,సూచనలు చేశారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, మున్సిపల్ సిబ్బంది ముజీబ్,జుబెర్,షకీల్,తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: ప్రభుత్వ నిబంధనల మేరకు మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు అధికారులు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌ను శనివారం తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వంట సామగ్రిని శుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లలిత, ఆర్పై శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెండు ఎంపీటీసీ స్థానాలు కేటాయించాలి

బుగ్గారం: బుగ్గారం గ్రామానికి మరో ఎంపీటీసీ స్థానాన్ని కేటాయించాలని స్థానిక ప్రజలు ఎంపీడీవోకు శనివారం వినతిపత్రం అందించారు. మండలంలో మొత్తం ఆరు ఎంపీటీసీ స్థానాలున్నాయి. ప్రస్తుతం బుగ్గారం–చందయ్యపల్లె గ్రామాలు కలిసి ఒక ఎంపీటీసీ స్థానంగా కొనసాగుతుండగా జనాభా ప్రాతిపదికన మరో స్థానాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ఈ రెండు గ్రామాల జనాభా 4026 ఉంది. వీటి కంటే చిన్న జనాభా గల గ్రామాలకు ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని, బుగ్గారం మాత్రం ఒకే ఎంపీటీసీ స్థానం ఉండడం సరికాదన్నారు. మండలాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మరో ఎంపీటీసీ స్థానాన్ని కేటాయించాలని స్థానికులు కోరారు.

నల్ల బ్యాడ్జీలతో ఈజీఎస్ ఉద్యోగుల నిరసన

పెగడపల్లి: సమస్యలు పరిష్కరించాలని ఈజీఎస్ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. పేస్కేలు వర్తింపజేయాలని, పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రెండోరోజు శనివారం పెన్‌డౌన్ చేపట్టి మండల పరిషత్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఉద్యోగులు అనిల్‌కుమార్, రమాపతి, రాజేశం, నానీ, రజనీకాంత్, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

కారు, బొలెరో ఢీ, ఒకరికి తీవ్ర గాయాలు

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్ స్టేజి జాతీయ రహదారిపై శనివారం కారు, బొలెరో వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం కోరుట్ల మండలం నాగులపేట గ్రామానికి చెందిన బైరి భరత్ తన కారులో గుమ్లాపూర్ నుంచి వెంకటాపూర్ స్టేజీ వైపు వెళ్తుండగా గుమ్లాపూర్ శివారులో గొర్రెలు అడ్డు రాగా వాటిని ఢీకొట్టాడు. భయంతో కారును అతి వేగంగా నడుపుకుంటూ వెళ్లాడు. ఈ క్రమంలో కోరుట్ల నుంచి జగిత్యాల వైపు జాతీయ రహదారిపై వెళ్తున్న లక్షెట్టిపేటకు చెందిన బొలెర వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న బైరి భరత్ తలకు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. బొలెరో వాహనం నడుపుతున్న వ్యక్తికి కూడా గాయాలయ్యాయి., పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

దూషించిన వ్యక్తిపై కేసు

సారంగాపూర్: మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన పుట్ట శేఖర్ మహిళను అసభ్య పదజాలంతో దూషించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై దత్తాత్రి కథనం ప్రకారం... పుట్ట శేఖర్‌కు తన వదినకు మధ్య భూ తగాదాలున్నాయి. ఈ విషయంలో శేఖర్ ఆమెను అసభ్య పదజాలంతో దూషించాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు శేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో ఆఫీస్ సబార్డినేట్ మృతి

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న ఆకుల రాజం(52) అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ శనివారం సాయంత్రం మృతిచెందినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కథలాపూర్‌కు చెందిన రాజం 20 రోజుల క్రితం ఆర్టీసీ బస్సు ప్రమాదంలో తీవ్రగాయాలపాలయ్యారు. కుటుంబసభ్యులు మెదడుకు సంబంధించి ఆపరేషన్ చేయించడంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. శనివారం పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం ప్రకటించారు.

మార్కండేయస్వామికి నాయకుల పూజలు



అంబారిపేటలో పూజ చేస్తున్న ప్రభుత్వ విప్

కథలాపూర్: మండలం లోని అంబారిపేటలో శనివారం మార్కండేయస్వామి జాతర ఘనంగా నిర్వహించారు. జాతర ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు అర్చకులు, నిర్వాహకులు పూర్ణకుంభం స్వాగతం పలికి సన్మానించారు.

అర్పపల్లిలో ఎమ్మెల్సీ పూజలు

సారంగాపూర్: మండలంలోని అర్పపల్లి మార్కండేయస్వామి ఆలయంలో శనివారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి వేర్వేరుగా ప్రత్యేక పూజలు చేశారు.

బాలిక వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

ధర్మపురి: మహారాష్ట్ర, గడ్చిరోలి జిల్లాకు చెందిన ఓ నిరుపేద బాలిక వైద్య ఖర్చులకు ఫేస్ బుక్ మిత్రులు రూ. 1.31 లక్షల విరాళాలు అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాకు చెందిన వాడకొండ రాజు, సరిత దంపతులకు ఒక కుమారుడు(14) ఒక కూతురు ఉన్నారు. నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో రాజు మృతి చెందగా, భార్య సరిత కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఏడు నెలల క్రితం తమ కూతురు నందిని (11) కి బ్లడ్‌క్యాన్సర్‌గా నిర్ధారణ అయింది. దాతల సాయంతో నాగపూర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో చికిత్స చేయిస్తోంది. డబ్బులు లేకపోవడంతో వైద్యం అందించలేని పరిస్థితి ఏర్పడింది. నందిని సమస్యను తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ స్పందించి బాలిక వైద్య ఖర్చులకు సాయం అందించాలని జనవరి 3 న ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. దీనికి స్పందించిన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు, ఇతర దాతలు బాలిక తల్లి సరిత బ్యాంకు ఖాతాకు రూ.1.31 లక్షల విరాళాలు పంపించారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

జగిత్యాలరూరల్: గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రూరల్ ఎంపీవో కందుకూరి రవిబాబు అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం ఒడ్డెరకాలనీలోని గ్రామపంచాయతీలో రక్షిత మంచినీటి బావి, వాటర్‌ట్యాంక్‌ను పరిశీలించి మాట్లాడారు. వేసవి దృష్ట్యా గ్రామీణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

జగిత్యాల: ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కుమార్ అన్నారు. శనివారం కార్యాలయంలో భద్రాచలంలో జరిగే రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫిబ్రవరి 4,5 తేదీల్లో భద్రాచలంలో జరిగే రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌కు అందరూ హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు కార్తీక్, మోహది, రాంవంశీ, అరవింద్ పాల్గొన్నారు.



కథలాపూర్: మండలంలోని పోసానిపేటలో గ్రామపంచాయతీ కార్యాలయం పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతో ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ సమస్యలు వస్తే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద బ్రేకర్లను ఆన్ ఆఫ్ చేయడం ఇబ్బందిగా ఉంటుందని, అధికారులు స్పందించి శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
భూమేశ్వర్, ట్రాన్స్‌కో ఏఈ, అంబారిపేట క్లస్టర్, సెల్ నంబర్: 79010445427

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఈ–పాస్ తోనే ఎరువులు విక్రయించాలి



సిరిపూర్‌లో స్టాక్ రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఏవో

మెట్‌పల్లి/మల్లాపూర్/ఇబ్రహీంపట్నం/సారంగాపూర్: ఈ–పాస్ యంత్రాల ద్వారానే రైతులకు ఎరువులను విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి(ఏవో) లావణ్య అన్నారు. మల్లాపూర్ మండలంలోని సిరిపూర్, మొగిలిపేట గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులను శనివారం తనిఖీ చేశారు.

ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్దండి, బర్థీపూర్ గ్రామాలలో ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎర్దండిలో ఓ ఫర్టిలైజర్ షాపులో ఓకే రైతుకు అధిక మొత్తంలో యూరియా అమ్మకాలు చేపట్టినందుకు షాపు యజమానికి షోకాజ్ నోటీసు ఇచ్చామని, లైసెన్స్‌ను రద్దు చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపినట్లు ఏవో రాజ్‌కుమార్ తెలిపారు.

రైతులకు ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు ఎరువులను విక్రయిస్తే దుకాణాదారుడి లైసెన్సు రద్దు చేస్తామని బీర్‌పూర్ ఏవో రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎరువులు, పెస్టిసైడ్ దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమాల్లో ఏఈవోలు,రైతులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడే అమ్మకాలు చేపట్టాలని మెట్‌పల్లి మండల వ్యవసాయాధికారి దీపిక అన్నారు.మెట్‌పల్లి పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరిపిన రెండు ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా అమ్మకాలు చేపట్టవద్దని ఆదేశించారు.

రాళ్లవాగు ప్రాజెక్టు కుడి కాలువకు గండి



కుడికాలువ గండి పండి వృథాగా పోతున్న నీరు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట శివారులో రాళ్లవాగు ప్రాజెక్టు కుడి కాలువకు శనివారం గండి పడటంతో నీరంతా వృథాగా పోతుందని ఆయకట్టు రైతులు తెలిపారు. భూషణరావుపేట– కోనాపూర్ గ్రామాల సరిహద్దులో ప్రాజెక్టు కుడికాలువకు ఇటీవల రూ. 20 లక్షలు వెచ్చించి సైఫాన్ నిర్మించారు. నిర్మించిన సైఫాన్ పక్కనే కాలువకు గండి పడటంతో పనుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనుల నిర్వహణ విషయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తిందని రైతులు మండిపడుతున్నారు. అధికారులు చొరవ చూపి కాలువకు పడిన గండిని త్వరగా పూడ్చివేసి ఆయకట్టుకు నీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై నీటిపారుదలశాఖ డీఈ నాగేశ్ వివరణ ఇస్తూ... కాలువకు పడిన గండిని పూడ్చి వేయిస్తామన్నారు. సైఫాన్ వద్ద కాలువ కట్ట పనులు పూర్తిగా చేయకపోవడం వల్ల గండిపడిందని తెలిపారు.

పెట్రోల్ బంకు స్థలంపై రైతుల ఆందోళన



డైరెక్టర్లను నిలదీస్తున్న రైతులు

కథలాపూర్: మండలం గంభీర్‌పూర్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే పెట్రోల్ బంక్ స్థలంను అధిక రేట్లకు కొనుగోలు చేశారని రైతులు శనివారం సొసైటీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. పెట్రోల్ బంక్ కోసం 15 గుంటల స్థలం అవసరం కావడంతో ఒక్కో గుంటకు రూ. 2.80 లక్షలు వెచ్చించి కొనుగోలు చేయడంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మార్కెట్ రేట్ కంటే 6 రేట్లు ఎక్కువ ధరతో కొనుగోలు చేసి సహకార సంఘం నిధులను దుర్వినియోగం చేశారంటూ రైతులు డైరెక్టర్లను నిలదీశారు. దీనిపై డైరెక్టర్లు సమాధానం చెప్పాలంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 4 గంటలపాటు రైతులు ఆందోళన చేశారు. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని సొసైటీ వైస్‌చైర్మన్ మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు తెలిపారు.

తుంగూర్‌లో సింగిల్ విండో ఏర్పాటుపై కలెక్టర్‌కు ఎంపీ లేఖ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో సింగిల్ విండో (పీఏసీఎస్)ను ఏర్పాటు చేయాలనీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు లేఖ రాశారు. పలు గ్రామాల రైతులు బీజేపీ నాయకులు ఈ విషయాన్ని బీజేపీ నాయకురాలు భోగ శ్రావణి ద్వారా ఎంపీ అర్వింద్ దృష్టికి తీసుకెళ్లగా, తుంగూర్, కండ్లపల్లి, రంగసాగర్, మంగేళ గ్రామాలను కలిపి తుంగూర్ కేంద్రంగా సింగిల్ విండోను ఏర్పాటు చేయాలని లేఖలో కోరారు.

నూతన కార్యవర్గం

జగిత్యాల: జగిత్యాల అబ్‌స్టెట్రిక్ గైనకాలజికల్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా డాక్టర్ పద్మినికుమారి, జనరల్ సెక్రటరీగా డాక్టర్ గూడూరి శ్రీలత, ఉపాధ్యక్షురాలుగా మంగాదేవి, కనకదుర్గ, జాయింట్‌సెక్రటరీగా విశ్వభారతి, నాగరత్న, ట్రెజరర్‌గా రజిత, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా జయంతి, రాణి మైత్రి, రోజా, అరుణ, హరిత, స్వాతిలను ఎన్నుకున్నారు.

పాఠశాలలో చెట్టుకు మంటలు

జగిత్యాలరూరల్: మండలం కల్లెడ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న భారీ వృక్షానికి శనివారం ప్రమాదశాత్తు నిప్పు అంటుకుంది. గ్రామస్తులు ఎంఈవో గాయత్రికి, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని చెట్టు మంటలను ఆర్పేశారు.